శుభదాయకం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు



వృక్ష శాస్త్ర విభాగంలో సుందరీకరణ పనుల్లో విద్యార్థులు



మొక్కలు పెంచే పనిలో విద్యార్థులు

- ఏయూ సుందరీకరణలో విద్యార్థుల భాగస్వామ్యం
- సొంతంగా నర్సరీ అభివృద్ధి
- అనేక రకాల మొక్కల పెంపకం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగం విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలను కార్యరూపంలో చూపుతున్నారు. పుస్తక జ్ఞానానికి ప్రత్యక్ష శిక్షణ జోడిస్తున్నారు. అంతటితో ఆగకుండా విశ్వవిద్యాలయానికి తమ వంతు ఉపయుక్తంగా నిలిచే కార్యాచరణతో సాగుతున్నారు. విద్యార్థులు స్వయంగా పలు మొక్కలను పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏయూకి ఎటువంటి ఆర్థిక భారం లేకుండా మొక్కలను పెంచి వర్సిటీలోని పలు ప్రాంతాల్లో సుందరీకరణకు వినియోగించే దిశగా పనిచేస్తున్నారు. విద్యార్థుల ప్రయత్నాన్ని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించి అభినందించారు. వర్సిటీ సుందరీకరణలో వీరిని భాగస్వాములను చేస్తామన్నారు.

విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా..

విద్యార్థులకు తరగతి గది బోధనతోపాటు వివిధ జాతుల మొక్కలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తారు. లాండ్‌స్కేప్ మేనేజ్‌మెంట్‌ను ఒక సబ్జెక్టుగా వీరికి బోధిస్తారు. కేవలం బోధనకు పరిమితం కాకుండా ఆచార్యులు వీటిని ఆచరణలో చూపుతున్నారు. ప్రతి ఏటా విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా వృక్ష శాస్త్ర విభాగ ప్రాంగణం, తోటను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం విభాగ ఆచార్యులు మరింత విస్తృతంగా ఆలోచించారు. విశ్వవిద్యాలయానికి అవసరమైన పూర్తిస్థాయిలో అలంకరణ మొక్కలను విభాగంలో విద్యార్థుల భాగస్వామ్యంతో పెంచనున్నారు. ముందుగా విభాగంలో వివిధ ఆకృతులతో మొక్కలు నాటారు. రెండో దశలో విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా వారిని ప్రోత్సహిస్తూ ఔషధ విలువలు కలిగినవి, అలంకరణకు వినియోగించేవి, ఆర్నమెంటల్ ప్లాంట్స్‌ను అభివృద్ధి చేస్తున్నారు.

భవిష్యత్తులో వర్సిటీకి ఉపయుక్తంగా..

విద్యార్థులు యూనివర్సిటీకి పెద్ద వనరుగా నిలుస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వీరి భాగస్వామ్యంతో ఏయూకి ఉపయుక్తంగా సొంతంగా నర్సరీని అభివృద్ధి చేసే పనులు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఇప్పటికే వందకుపైగా అలంకరణ మొక్కలను వీరు ఎంపిక చేసుకుని పెంచే పనిలో ఉన్నారు. మట్టి, కొబ్బరిపొట్టు, సేంద్రీయ ఎరువులు ఉపయోగించి వీటిని పెంచుతున్నారు. కేవలం కొద్దిపాటి వనరులను వినియోగిస్తూ వీటిని అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే వర్సిటీలో నాటిన పలు మొక్కల కాండం, దుంప, ఆకులను ఉపయోగించి కొత్తవి పెంచుతున్నారు. వీటితోపాటు ద్రాక్ష, మల్టీ విటమిన్ ఆకుకూర, అడ్డసరం, నిమ్మగడ్డి, వావిలి, టేకు, ఇన్సులిన్, పొడపత్రి వంటి మొక్కల పెంపకం పనుల్లో విద్యార్థులు బిజీగా ఉన్నారు.

ఆచార్యుల ప్రోత్సాహంతో..



లాండ్‌స్కేప్ మేనేజ్‌మెంట్ మాకు కోర్సులో భాగంగా ఉంటుంది. విభాగ ఆచార్యులు నిరంతరం ప్రోత్సహిస్తూ ప్రత్యక్ష తర్ఫీదును అందిస్తున్నారు. ఖర్చు లేని విధంగా వర్సిటీకి అవసరమైన మొక్కలు పెంచడం ఆనందాన్ని ఇస్తోంది.

– బి.ప్రసాద్, విద్యార్థి

సేంద్రియ విధానంలో..



మేము నేర్చుకున్న అంశాల ద్వారా ఆర్గానిక్ విధానంలో ఆరోగ్య, ఔషధ మొక్కలు పెంచుతున్నాం. దీని కారణంగా ఖర్చు తక్కువ ఉంటుంది. త్వరలో విభాగంలో సేంద్రీయ ఎరువు తయారు చేస్తాం. వర్సిటీ అధికారులు సహకరిస్తున్నారు.

– ఐ.స్నిగ్ధ, విద్యార్థిని

ఔషధ పార్క్ ఏర్పాటు చేయాలి....



నిత్యం మన చుట్టూ ఉండే అనేక మొక్కల్లో ఔషధ గుణాలు ఉంటాయి. ప్రజలకు వీటిపై అవగాహన కల్పించేలా ప్రత్యేకంగా ఒక ఔషధ వనం ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉంది. ఏయూ ఉన్నతాధికారుల సహకారంతో దీనిని ఏర్పాటు చేస్తాం.

– ఎస్.మోహన్, విద్యార్థి

మంత్రి దృష్టికి దుర్గానగర్ రక్షణ గోడ నిర్మాణ సమస్య



మంత్రి అమర్‌నాథ్‌కు సమస్య వివరిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు

మద్దిలపాలెం : సింహాచలం దేవస్థానం జీవీఎంసీ 15వ వార్డు పరిధిలో గల దుర్గానగర్ కాలనీ నివాస ప్రాంతాలను కలుపుతూ రక్షణ గోడ నిర్మాణం చేపడుతోందని, ఆ నిర్మాణంలో నివాసిత ప్రాంతాన్ని మినహాయించాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విన్నవించినట్లు వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు తెలిపారు. ఈమేరకు మంత్రి నివాసానికి శనివారం బాధితులతో కలిసి వెవెళ్లామన్నారు. దుర్గానగర్ కాలనీలో 6 ఎకరాల 80 సెంట్ల ప్రాంతంలో పేదలు నివాసాలుంటున్నారన్నారు. దీనికి సంబంధించి 1980లోనే దేవస్థానం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం గ్రామస్తులందరూ డబ్బులు చెల్లించారని తెలిపారు. దీంతో స్పందించిన మంత్రి అమరనాథ్ సింహాచలం దేవస్థానం ఈవోతో ఫోన్‌లో మాట్లాడారన్నారు. ఈ భూమిని రీ సర్వే చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవైస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, నరాల సత్తిబాబు, దిలీప్‌కుమార్, రాంప్రసాద్, కృష్ణమూర్తి, రామకృష్ణ, త్రినాథ్, దుర్గానగర్ గ్రామస్తులు పాల్గొన్నారన్నారు.

'చలో ఢిల్లీ'కి కార్మిక నాయకులు

తాటిచెట్లపాలెం: ఢిల్లీలో ఈ నెల 5న జరగనున్న కార్మిక, కర్షక సంఘర్ష్ ర్యాలీకి విశాఖ నుంచి కార్మిక నాయకులు శనివారం ఉదయం సమతా ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వెళ్లారు. సుమారు వంద మంది భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మిక నాయకులు తరలి వెళ్లారు. వీరికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ అభినందనలు తెలియజేశారు.

క్లుప్తంగా

ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు



ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మెడికవర్, కృష్ణ ఆస్పత్రులను శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తనిఖీ చేశారు. ఇన్‌పేషెంట్ల రికార్డు, రోగుల కేస్‌షీట్లు పరిశీలించారు. సాధారణ ప్రసవాలను పోత్సహించాలని ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రుల యాజమాన్యాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి, గణాంక అధికారి మురళీకృష్ణ, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



మృతుడి భార్యకు రూ.10 వేలు అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి లక్ష్మీపార్వతినగర్‌లో శుక్రవారం ఎలకల గురునాయుడు గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందారు. ఆయనకు వైఎస్సార్ బీమా రూ.లక్ష వర్తించింది. ఇందులో భాగంగా తక్షణ సహాయం కింద శనివారం కార్పొరేటర్ కెల్ల సునీత మృతుడి ఇంటికి వెళ్లి అతని భార్య రేణుకకు రూ.10,000 నగదు అందజేశారు. మిగిలిన మొత్తం ఆమె బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారని చెప్పారు. సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ రామకృష్ణ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, దుర్గారావు, పోలరావు, భాగ్యరాజు, పైడిరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఒడిశా ఆవిర్భావ దినోత్సవం



ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న నాయక్

బీచ్‌రోడ్డు: ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో శనివారం సిరిపురం ఆల్ ఇండియా రేడియా వద్ద ఒడిశా రాష్ట్ర 88వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ప్రెసిడెంట్ జె.కె.నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో ఉన్న ఒడిశావాసులు ఈ వేడుకలను ఎంతో ఘనంగా కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారన్నారు. ఫుడ్ ఫెస్టివల్ కోసం 15 రోజుల నుంచి వివిధ రకాల వంటలను సిద్ధం చేసి వేడుకల్లో ప్రదర్శించారని చెప్పారు. నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.

కెనరా బ్యాంకు నిధులతో బీసీ హాస్టల్ ఆధునికీకరణ



బీసీ హాస్టల్‌ను ప్రారంభిస్తున్న సంక్షేమ శాఖాధికారులు

మద్దిలపాలెం: కెనరా బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కేటాయించిన నిధులతో ఇసుకతోట బీసీ సంక్షేమ వసతిగృహాన్ని ఆధునికీకరించారు. ఆధునికీకరణకు కెనరా బ్యాంకు రూ.7.24 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో వసతి గృహానికి మరమ్మతులు చేయించారు. ఆధునికీకరణ అనంతరం వసతి గృహాన్ని కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ వేణుగోపాల్, డివిజనల్ మేనేజర్ ఐ.వి.కృష్ణారావు, వి.మల్లేశ్వరరావు, చీఫ్ మేనేజర్ లాల్ రోహిల, బీసీ సంక్షేమ శాఖాధికారులు శ్రీదేవి శనివారం దీనికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్లు కల్యాణి, జి.వి.నర్సింహారావు, సహాయ సంక్షేమాధికారి వసంత లక్ష్మి, వసతి గృహ సంక్షేమాధికారి కృష్ణారావు, శ్రీలత, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పది పరీక్షల్లో తనిఖీ అధికారుల ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి అవాంతరాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఫ్లయింగ్, సిటింగ్ స్క్వాడ్‌లపై ఉందని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ టీమ్‌లో నియమితులైన అధికారులతో శనివారం క్వీన్ మేరీ హైస్కూల్లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా తనిఖీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో డీఈవో కార్యాలయం నుంచి డ్యూటీ వేసిన వారు మాత్రమే విధులు నిర్వహించాలన్నారు. ప్రైవేటు స్కూళ్ల మేనేజ్‌మెంట్ వారు, కరస్పాండెంటెంట్, హెచ్‌ఎం ఎవరూ ఉండటానికి వీల్లేదన్నారు. పరీక్షల నిర్వహణలో ఎదురయ్యే అవాంతరాలను సకాలంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీమోహన్, ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, డీసీఈబీ సెక్రటరీ కృష్ణకుమార్, ఏపీవో అప్పలనాయుడు, భీమరాజు పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించిన డిప్యూటీ కలెక్టర్



ఆటోగ్రాఫ్ ట్రీపై సంతకం చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ మాధవి

ఏయూక్యాంపస్: జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని డిప్యూటీ కలెక్టర్ జె.మాధవి శనివారం సందర్శించారు. పార్క్‌లోని వివిధ జాతుల వృక్షాలను తిలకించి, వాటి ప్రత్యేకతలు తెలుసుకున్నారు. ఆర్చిడోరియంలో ఉన్న పలు అరుదైన మొక్కలను ఆసక్తిగా తిలకించారు. ఆటోగ్రాఫ్ ట్రీపై సంతకం చేసి సంతోషం వ్యక్తం చేశారు.

అరుదైన ఆర్చిడ్ విరబూసింది..

పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనంలో అరుదైన హుడెడ్ ఆర్చిడ్ విరబూసింది. తెల్లని పుష్పాలతో కనువిందు చేసింది. డెండ్రోబియం కుటుంబానికి చెందిన ఇది శంఖు ఆకారంలోని పువ్వులను పూస్తుంది. అందుకే దీనికి హుడెడ్ ఆర్కిడ్ అని పిలుస్తారు. వసంత కాలంలో ఆకులు లేకుండా కనిపించే ఈ మొక్క వర్షాకాలంలో ఆకుపచ్చని ఆకులతో కనిపిస్తుంది. వేసవిలో సువాసన కలిగిన తెలుపు, పసుపు, గులాబీ రంగు పువ్వులతో అందంగా కనిపిస్తుంది. అరుదైన ఈ మొక్కను చూడాలంటే జీవ వైవిధ్య ఉద్యానవనానికి వెళ్లాల్సిందే.

పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం



మాట్లాడుతున్న ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.బి.రాజేంద్రప్రసాద్

సీతంపేట : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంఘం ఆరోపించింది. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం సమావేశం స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.బి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్పంచులు ఎవరూ విద్యుత్ బిల్లులు కట్టవద్దన్నారు. సర్పంచుల సంతకం లేకుండా 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లు నిధులు దారి మళ్లించిందని విమర్శించారు. సర్పంచుల విధులు, నిధులు, అధికారాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ సర్పంచుల గౌరవ వేతనం రూ.15వేలకు, జెడ్పీటీసీ, ఎంపీటీసీల గౌరవ వేతనం రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణా సర్పంచుల సంఘం ప్రెసిడెంట్ వై.నాగేంద్ర మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా పర్యటించి సర్పంచుల విధులు, అధికారాలపై చైతన్య పరిచేలా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉత్తరాంధ్ర జిల్లాల సర్పంచులు పాల్గొన్నారు.

పోలమాంబ వార్షిక జాతరకు విస్తృత ఏర్పాట్లు



వివరాలు విడుదల చేస్తున్న సహాయ కమిషనర్ శిరీష తదితరులు

ఏయూక్యాంపస్: శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు విశాఖపట్నం జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష తెలిపారు. శనివారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 4న నిర్వహించే వార్షిక జాతరకు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి మంచినీరు, మజ్జిగ, ప్రసాదం సరఫరా చేస్తామన్నారు. పోలీసు భద్రత, జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ పిడింట్ల శంకర రెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయ పరుచుకుని జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విలేఖరుల సమావేశంలో ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, 17, 20వ వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు గేదెల నాగరాజు, మువ్వల సురేష్, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూకు వాటర్ ప్లాంట్ వితరణ

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటిలిజెన్స్ విశాఖ జోనల్ యూనిట్ రివర్స్ ఆస్మాసిస్ వాటర్ ప్లాంట్‌ను వితరణగా ఇచ్చింది. ఈ ప్లాంట్‌ను జూలో సాంబార్ ఎన్‌క్లోజర్ ఎదురుగా సందర్శకుల కోసం ఏర్పాటు చేశారు. దీన్ని శనివారం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటిలిజెన్స్ విశాఖ జోనల్ యూనిట్ జాయింట్ డైరెక్టర్ వై.భాస్కరరావు, జూ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా హై సేవా కార్యక్రమంలో భాగంగా జూలో సందర్శకుల కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్లాంట్‌కు రోజులో 500 లీటర్ల నీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఉందన్నారు. జూ ఏసీఎఫ్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, జీఎస్టీఇంటిలిజెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

హరినాథ్ కుటుంబాన్ని పరామర్శించిన అక్కరమాని



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న అక్కరమాని

ఎంవీపీకాలనీ: ఇటీవల సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన అంబటి హరినాథ్ కుటుంబాన్ని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పరామర్శించారు. 18వ వార్డు అప్పుఘర్ ప్రాంతానికి చెందిన అంబటి హరినాథ్ సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మెరైన్ పోలీసులు కేసు నమోదు చేసి గతకొన్ని రోజులుగా హరినాథ్ కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్పుఘర్‌లోని వారి నివాసానికి శనివారం ఉదయం వెళ్లిన అక్కరమాని వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సముద్రంలో గల్లంతై నాలుగు రోజులు అవుతున్నా నేటికీ ఆచూకీ దొరకలేదని కుటుంబ సభ్యులు అక్కరమాని వద్ద వాపోయారు. దీంతో జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు అక్కడి నుంచే ఫోన్ చేసిన అక్కరమాని తక్షణమే గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని, ప్రభుత్వ పరంగా హరినాథ్ కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. మత్స్యకార శాఖ ఉన్నతాధికారులతో సైతం అక్కరమాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, వాసుపల్లి ఎల్లాజీ, ఉమ్మిడి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ ఆపరేషన్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తరగతి గదులను అలంకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు ఆహ్వానించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ కెల్ల సునీత మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్ల మాదిరిగా ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఆమె సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



వినియోగదారుల అవగాహన సదస్సులో పాల్గొన్న సివిల్ జడ్జి బులికృష్ణ తదితరులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్ కళాశాలలో శనివారం వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బులికృష్ణ మాట్లాడుతూ సాంకేతికత వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో నేరాలు సైతం భారీగా పెరిగిపోతున్నాయన్నారు. బంగారం, నిత్యావసర సరకులు, కురగాయలు ఇలా అన్నింటా తూకంలోను, ధరల్లో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ దాడుల ద్వారా ఆర్థిక నేరాలు ఎక్కువ అవుతున్నాయని, వినియోగదారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి తప్పిదాలను గుర్తించినా సంబంధిత విభాగాలకు సమాచారం అందించి అడ్డుకట్ట వేయాలన్నారు. దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రూపవతి మాట్లాడుతూ మహిళలు వారికి ఎలాంటి సమస్యలున్నా దిశ పోలీసు యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వినియోగదారుల ప్రొటెక్షన్ సెల్ కార్యదర్శి లింగేశ్వరరావు, అదనపు కార్యదర్శి పి.సత్యకుమార్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ అయ్యగారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్...

మంత్రి మేరుగను కలిసిన ఏయూ ఆచార్యులు



మంత్రి మేరుగ నాగార్జునకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆచార్య షారోన్ రాజు

ఏయూక్యాంపస్: నగరానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జునను శనివారం ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ఆచార్య పి.సుబ్బారావు, డాక్టర్ శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అధికారులు, ఆచార్యుల అభినందనలు



విద్యార్థికి జ్ఞాపిక అందిస్తున్న ఆచార్య శోభశ్రీ తదితరులు

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విశాఖ నగరం వేదికగా నిర్వహించిన జీ20 సదస్సులో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యూనివర్సిటీ కనెక్ట్ సదస్సు నిర్వహణలో, విజయవతం చేయడంలో భాగస్వాములైన విద్యార్థులను అధికారులు అభినందించారు. కార్యక్రమ నిర్వహణలో వలంటీర్లుగా బాధ్యతలు నిర్వహించిన విద్యార్థులను ఏయూ రాజనీతి శాస్త్ర విభాగం సమావేశ మందిరంలో శనివారం సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ఏయూ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ విద్యార్థులను అభినందించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ చెర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, విభాగాధిపతి ఆచార్య జి.వీర్రాజు, విభాగ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం బలోపేతానికి చర్యలు



ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఏఆర్ఈ శ్రీనివాస్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం అలుమ్ని రిలేషన్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఎస్.శ్రీనివాస్ నియమితులయ్యారు. శనివారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నుంచి ఉత్తర్వులను ఆయన స్వీకరించారు. అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వీసీ మట్లాడుతూ త్వరలో ఏయూ శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనుందని, దీనికి అనుగుణంగా బలమైన పూర్వ విద్యార్థుల సంఘాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఏకతాటిపైకి తీసుకొచ్చే విధంగా పనిచేయాలన్నారు. ఏయూతో సమన్వయం చేస్తూ పూర్వ విద్యార్థుల సంఘాన్ని మరింత పటిష్టం చేయడానికి ప్రణాళిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో డాక్టర్ రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ విద్యార్థులకు కాగ్నిజెంట్ స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులతో అధికారులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుతున్న విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసింది. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రస్తుత బ్యాచ్‌లో 10 మందికి స్కాలర్‌షిప్ మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులను అందించింది. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.35 వేల చొప్పున రెండేళ్లకు రూ.70 వేలు కాగ్నిజెంట్ ఫౌండేషన్ అందిస్తుంది. స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శనివారం అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, విభాగ ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు.